ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



చిత్తూరు
జిల్లా వార్తలు
బుధవారం 5 ఫిబ్రవరి 2025

తిరుపతి డిప్యూటీ మేయర్

సైకిల్ వశం

కూటమి తరపున టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ విజయం

● వైసీపీకి 21, టీడీపీకి 27 మంది మద్దతు ● ఒకరు తటస్థం, ఇద్దరు గైర్హాజరు

తిరుపతి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికపై ఉత్కంఠ వీడింది. 35వ డివిజన్ టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ప్రకటించారు. టీడీపీ అభ్యర్థి మునికృష్ణకు 26 మంది, వైసీపీ అభ్యర్థి లడ్డూ భాస్కర రెడ్డికి 21 మంది మద్దతు తెలిపారు. సోమవారమే డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగాల్సి ఉండగా, తగిన కోరం లేకపోవడంతో ఎన్నికను మంగళవారం తిరిగి నిర్వహించారు.

సోమవారం నాటి హైడ్రామా సంఘటనలతో ఎన్నికల్లో టెన్షన్ తప్పదని అందరూ భావించారు. అయితే ప్రశాంతంగా డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగిపోయింది. మొదట ఎంపీ గురుమూర్తితో కలిసి 22మంది వైసీపీ సభ్యులు బస్సులో ఎస్వీయూ సెనేట్ హాలుకు చేరుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 26 మంది కార్పొరేటర్లతో హాజరయ్యారు. ప్రత్యేక కౌన్సిల్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి వారికి కేటాయించిన సీట్లలో కూర్చున్న తర్వాత శుభం భన్సల్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. వైసీపీ అభ్యర్థి లడ్డూ భాస్కర రెడ్డిని మేయర్ డాక్టర్ శిరీష, ఆదం రాధాకృష్ణారెడ్డి బలపరచగా, టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, అన్నా అనిత పైకి లేచి బలపరిచారు. అభ్యర్థులకు చేతులెత్తి మద్ధతు తెలపాలని ఎన్నికల అధికారి సూచించారు. ముందుగా వైసీపీ అభ్యర్థి పేరు చెప్పగా 21 మంది సభ్యులు చేతులెత్తారు. ఆ తర్వాత టీడీపీ అభ్యర్థికి 26 మంది సభ్యులు చేతులెత్తి మద్దతు పలకడంతో ఆర్సీ మునికృష్ణ విజయం ఖరారైంది.

ఎన్నిక జరిగింది ఇలా...

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 47 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్‌అఫిషియో సభ్యులున్నారు. మొత్తం 50 మంది ఓటర్లుగా ఉండగా 48మంది ఎన్నికకు హాజరయ్యారు. ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఉన్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, 15వ డివిజన్ కార్పొరేటర్ షాలిని రెడ్డి గైర్హాజరయ్యారు.హాజరైనవారిలో 5వ డివిజన్ కార్పొరేటర్ అమరనాథ రెడ్డి ఎవరికీ మద్దతు తెలపలేదు.

వైసీపీ బృందంతో వచ్చి టీడీపీకి మద్దతు

వైసీపీ బృందం నుంచి వచ్చిన 22 మంది కార్పొరేటర్లలో 17వ డివిజన్ కార్పొరేటర్ రత్నకుమారి టీడీపీకి మద్దతు పలికారు. దీంతో వైసీపీ 21ఓట్లకే పరిమితమైంది. అదేవిధంగా 5వ డివిజన్ కార్పొరేటర్ అమరనాథ రెడ్డి 26 మంది కూటమి బృందంతో కలిసి వచ్చినప్పటికీ ఎవరికీ మద్దతు తెలపకుండా మౌనంగా ఉండిపోయారు. దీంతో వైసీపీ బృందం నుంచి ఒక ఓటు కూటమికి వచ్చినప్పటికీ 26మంది మద్దతు మాత్రమే మిగిలింది. ఇదిలా వుంటే టీడీపీకి రత్నకుమార్ మద్దతు పలకడంపై కౌన్సిల్ హాల్లోనే కొందరు వైసీపీ మహిళా కార్పొరేటర్లు తూలనాడారు. సమావేశం అనంతరం ఆమె విలపిస్తూ సొమ్మసిల్లి బయట సోఫాలో వాలిపోవడంతో కూటమి మహిళా కార్పొరేటర్లు ఆమెకు సపర్యలు చేసి ఓదార్చారు.

విప్ టైమప్.. ఖంగుతిన్న వైసీపీ

డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రకియ ప్రారంభమవుతుండగా వైసీపీ తరపున విప్ జాబితా దరఖాస్తును ఎంపీ గురుమూర్తి, కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి ఎన్నికల అధికారికి అందజేయబోయారు. అయితే ప్రత్యేక సమావేశం 11 గంటలకు ప్రారంభమైందనీ, అంతకంటే ముందుగా ఇస్తేనే జాబితా తీసుకోవాలన్న నిబంధన ఉందని జేసీ చెప్పడంతో వారు ఖంగుతిన్నారు. విప్ జారీచేస్తే ప్రత్యర్థికి ఓటు వేసిన కార్పొరేటర్లు సభ్యత్వం కోల్పోయే అవకాశం ఉంటుంది. ఆ భయంతో అయినా తమకే ఓటు వేస్తారన్న వైసీపీ వ్యూహం చివరకు ఫలించకుండాపోయింది.




డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి అభ్యర్థికి మద్దతుగా చేతులెత్తిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు

ఒక్కడుగా మొదలై డిప్యూటీగా ఎదిగి..

వైసీపీ హయాంలో నాలుగేళ్ల క్రితం జరిగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన ఏకైక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ. అధికార బలంతో 26 డివిజన్లను ఏకగ్రీవం చేసుకుని 23 డివిజన్లను దౌర్జన్యంగా తన ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకున్న వైసీపీకి ఆర్సీ మునికృష్ణ ఒకే ఒక్కడుగా ఎదురునిలిచి టీడీపీ జెండా ఎగురవేశారు. కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు దాడికి దిగేటంత పనికి ఒడిగట్టినా, అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఏక్ నిరంజన్ అంటూ హేళన చేసినా టీడీపీ తరపున తన గళాన్ని వినిపిస్తూ నే వచ్చారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతికార్యక్రమంలోనూ తనదైన శైలిలో అప్పటి అధికార పక్షంపై విరుచుకుపడే ఆర్సీ మునికృష్ణ పోరాట ధీరత్వానికి ఫలితం ఇప్పుడు దక్కింది. ఆ ఒక్కడూ వటుడింతై.. అన్నట్టుగా ఏకంగా డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు.

రాజకీయ నేపథ్యమిదీ :1998లో టీడీపీలో చేరిన ఆర్సీ మునికృష్ణ 2004లో జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2009 నుంచి 12 వరకు తిరుపతి నగర అధ్యక్షుడిగా పార్టీకి జవసత్వాలు నింపారు. ఆతర్వాత జిల్లా ఉపాధ్యక్షుడుగా కొనసాగారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గంగమ్మకు పరమభక్తుడైన ఆర్సీ 2017 నుంచి 2019 వరకు తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో 35వ డివిజన్ నుంచి టీడీపీ కార్పొరేటర్‌గా గెలిచి తాజాగా డిప్యూటీ మేయర్ కుర్చీని సాధించారు. కాగా తన గెలుపునకు సహకరించిన కూటమి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి అభివృద్ధి కోసం కూటమి నాయకులతో కలసి పనిచేస్తామని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.



'ఆయుష్'కు ఊపిరి

● ఆస్పత్రులకు వైద్యుల కేటాయింపు
● తెరుచుకోనున్న అన్ని కేంద్రాలు



చిత్తూరు ఆయుష్ వైద్యశాల

ఉమ్మడి జిల్లాలోని వైద్యశాలలు
ఆయుర్వేద - 22
హోమియో -25
యునాని - 14

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఆయుష్ ఆస్పత్రులకు కేంద్ర ప్రభుత్వం ఊపిరి పోసింది. జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా ఖాళీగా ఉన్న స్థానాల్లో కొత్త వైద్యులను నియమించింది. కొన్నేళ్లుగా వైద్యులు, సిబ్బంది లేక మూతపడిన ఆయుష్ వైద్యశాలలన్నీ తెరచుకుంటున్నాయి. ప్రజలకు ప్రాచీన సంప్రదాయ వైద్యం అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేదం, హోమియోపతి, యునాని అన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెస్తూ 'ఆయుష్' విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ వైద్యశాలలకు మందుల కొరత లేకుండా కేంద్రం అందిస్తోంది. భారతీయ సంప్రదాయ వైద్యం కావడం, ఎలాంటి దుష్ప్రభావాలు లేకపోవడంతో దీర్ఘకాలిక రోగులు ఆయుష్ వైద్యంపై ఆసక్తి చూపుతున్నారు. అల్లోపతిలో తగ్గని రుగ్మత ఆయుర్వేదంతో నయమవుతుందని చాలామందిలో విశ్వాసం. దశాబ్దాల కిందట ఏర్పాటైన ఈ ఆస్పత్రుల్లో ఉద్యోగ విరమణ పొందిన వైద్యులు, సిబ్బంది స్థానాలను భర్తీ చేయకుండా వదిలేయడంతో కొన్ని చోట్ల డిప్యుటేషన్ పై వైద్యులను సర్దుబాటు చేస్తూ వచ్చారు. దీంతో ఒక్కో కేంద్రం వారానికి ఒకటి, రెండ్రోజులు మాత్రమే తెరుచుకుని.. ప్రజలకు వైద్యసేవలు అందని ద్రాక్షలా మారాయి. తాజాగా ఏపీపీఎస్‌సీ ద్వారా వైద్యులను నియమించారు. ఈ క్రమంలో జిల్లాలో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్న పలమనేరు, ఎర్రకోటపల్లె, ఎస్‌ఎస్‌కొండ, మంగళంపేట ప్రాజెక్టు హోమియో డిస్పెన్సరీలకు ప్రభుత్వం వైద్యులను నియమించింది. అలాగే సెలవుపై పీజీలు చేసేందుకు వెళ్లిన వారు సైతం వారి సెలవులు పూర్తి చేసుకుని, విధుల్లో చేరినట్లు అధికారులు తెలిపారు.

మందుల కొరత లేదు



ఆయుర్వేదం, హోమియో, యూనాని వైద్యశాలలకు మందులు పుష్కలంగా ఉన్నాయి. ఖాళీలు ఉన్న వైద్య శాలలకు ఇటీవల వైద్యులను కూడా నియమించడం జరిగింది. అందరూ విధుల్లో చేరి సేవలు అందిస్తున్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ వైద్యంలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.

- శేఖర్‌రాజు,
రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, కడప

సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం



ఆయుర్వేదం సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం. జలుబు నుంచి కిడ్నీ వ్యాధులు, పక్షవాతం, నరాలు, ఆస్తమా, స్త్రీ వ్యాధులు, సైనసైటిస్, వెరికోస్‌వరకు సుమారు వందల రకాల జబ్బులకు సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వైద్యం పొందవచ్చు. గతంలో పోలిస్తే అర్బన్ ప్రాంతాల్లో చాలామందిలో ఆయుర్వేదంపై అవగాహన వచ్చింది. గ్రామీణుల్లో అవగాహన పెరగాలి. ప్రతి ఆయుష్ ఆస్పత్రిలో మహిళా, పురుషుల కోసం యోగా నేర్పించడానికి ఇన్‌స్ట్రక్టర్లు అందుబాటులో ఉన్నారు.

- డాక్టర్ హరిత, మెడికల్ ఆఫీసర్, చిత్తూరు ఆయుష్ ఆస్పత్రి

15లోగా ఉద్యోగుల ఐటీ డిడక్షన్

వివరాలన్నీ సిస్టంలో ఉంచండి

● ఖజానా డీడీ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఆదాయపన్ను మినహాయింపు (డిడక్షన్) వివరాలన్నీ ఈనెల 15లోగా సిస్టంలో ఉంచాలని డ్రాయింగ్ డిస్బర్స్‌మెంట్ ఆఫీసర్స్ (డీడీవో)లను ఖజానాశాఖ ఆదేశించింది. ఈ మేర ఖజానాశాఖ డీడీ రామచంద్ర డీడీవోలకు ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఆదాయ పన్ను మినహాయింపు వివరాలను గతంలో ఫిబ్రవరి నెలలో వారి పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను పరిశీలించినట్లు డీడీవోలు డిక్లరేషన్ ఇచ్చేవారని తెలిపారు. అయితే ఈ ఏడాది నుంచి ఉద్యోగులు ఆదాయ పన్ను స్లాబ్‌ల వారీగా వారికి వచ్చే జీతం, డీఏ, హెచ్‌ఆర్ఏ, సీసీఏ (వికలాంగులకు), గ్రాస్, జీతం, మెడికల్, హౌస్ వంటి రికవరి వివరాలను సరైన ఆధారాలతో సిస్టమ్‌లో డీడీవోలు అందజేయాలని ఆయన జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రస్తుతం నెలవారీగా ఆదాయపన్ను చెల్లింపులు చేయగా, మార్చినెల లోగా మినహాయింపులు పోగా చెల్లించాల్సిన మిగులు చెల్లింపులను ఫిబ్రవరిలోగా చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ ఉద్యోగి చెల్లించాల్సిన ఆదాయపన్ను వివరాలను ఇవ్వని యెడల అట్టి ఉద్యోగి వివరాలను డీడీవోలే లెక్కింపులు చేసి అందించాలని చెప్పారు.

నేడు అపిట్కో గృహ లబ్ధిదారులతో చైర్మన్ సమీక్ష సమావేశం

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం పూనేపల్లె సమీపంలోని ఎన్టీఆర్ నగర్‌లో నిర్మించిన అపిట్కో గృహ సముదాయాన్ని ఆ సంస్థ చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ బుధవారం పరిశీలించడంతోపాటు లబ్ధిదారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తారని అపిట్కో అధికారి ధనంజయ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

గజరాజు ఘీంకారం

● తిరుచానూరులో పరదా రంగును చూసి బెదిరిన ఏనుగు



పుష్కరిణి వద్ద షెడ్డుకున్న పరదాలు

తిరుచానూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా తిరుచానూరులో మంగళవారం ఉదయం సూర్యనారాయణ స్వామికి జరిగిన అశ్వవాహన సేవలో బెదిరిన గజరాజు ఘీంకరించింది. దీంతో భక్తులు ఆందోళన చెందారు. అమ్మవారి పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించాక దుస్తులు మార్చుకునేందుకు ఆలయం వెనుక తాత్కాలిక షెడ్లు వేశారు. వీటి చుట్టూ బ్లూరంగులో పరదా కట్టారు. అదే సమయంలో సూర్యనారాయణస్వామికి అశ్వవాహనసేవ సందర్భంగా గంగుంద్రమండపం వద్దకు వచ్చిన గజరాజు(శ్రీనిధి) ఆ షెడ్లకు చుట్టిన పరదా రంగును చూసి బెదిరింది. ఘీంకారం చేసింది. దీంతో భక్తులు, ఆలయాధికారులు ఆందోళన చెందారు. మావటీలు గజరాజును పక్కకు తీసుకెళ్లి సముదాయించారు.ఆ తర్వాత వాహన సేవల్లో యథావిధిగా గజరాజు పాల్గొంది.



వాహన సేవలో బెదిరిన గజరాజు

వైభవంగా రథసప్తమి



ప్రత్యేక అలంకరణలో సూర్యుడు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో మూల విరాట్‌కు కాకర్లవారిపల్లెకు చెందిన దివంగత నాదముని నాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేకువ జామున తొలుత ప్రధాన ఆలయం నుంచి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామికి ఊరేగింపు నిర్వహించారు. వరదరాజస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు ఆలయం వారు అభిషేకం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజ స్వామి ఉత్సవ విగ్రహాలను సూర్య ప్రభ వాహనంపై ఊరేగించారు. ప్రధాన ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద సూర్య నమస్కారాలు నిర్వహించారు. మణికంఠేశ్వరాలయంలోని సూర్య భగవానుడికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన ఆలయం నుంచి నిర్వహించిన గ్రామోత్సవం

జిల్లాకో క్యాన్సర్ డే కేర్ సెంటర్

● మూడేళ్లలో ఏర్పాటుకు కేంద్రం ప్రణాళిక ● వ్యాధి గుర్తించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నాం
● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాబోయే మూడేళ్లలో ప్రతి జిల్లాలో క్యాన్సర్ డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం ప్రణాళిక వేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. తిరుపతిలో మంగళవారం ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, కోలా ఆనంద్ తదితర నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో క్యాన్సర్ ద్వారా 9.93 శాతం మరణాలు సంభవిస్తున్నట్లు చెప్పారు. దీనిపై అవగాహన లేకపోవడం, ముందస్తు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. క్యాన్సర్ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. 1500 బృందాలతో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికి 71 లక్షలమందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించగా 66 వేలమంది అనుమానితులుగా తేలారన్నారు. వీరిని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్స్‌గా పరిగణిస్తున్న బోధనాస్పత్రులకు రెఫర్‌చేసి, మరోసారి పరీక్షలు నిర్వహించి క్యాన్సర్‌ను నిర్ధారిస్తామన్నారు. ఏ దశలో క్యాన్సర్ ఉందో గుర్తించి చికిత్స అందిస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలు రొమ్ము, సర్వైకల్ కాన్సర్ నిర్ధారణ పరీక్షలను చేయించుకోవాలని సూచించారు.



గత లోపాలను సరిదిద్దుతున్నాం

కూటమి అధికారంలోకి రావడంతో ఐదేళ్ల పీడకల నుంచి రాష్ట్రం బయట పడిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. 'గత ఐదేళ్లలో రాష్ట్రం 20సంవత్సరాల వెనుక బడింది. ఆయా లోపాలను సరిదిద్దుకుంటూ ఈ ఐదేళ్లలో 15 సంవత్సరాలు రాష్ట్రం ముందుకెళ్లేలా అభివృద్ధి పనులు చేపట్టాం' అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన వివరించారు. దార్శనికుడైన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. దీనికి కేంద్రం సహకరిస్తోందని, బడ్జెట్‌లోనూ ప్రత్యేక కేటాయింపులు చేయడంతోపాటు ప్రాయోజిత పథకాలద్వారా రాష్ట్రానికి లబ్ధి చేకూరుస్తోందని చెప్పారు.

83 జూనియర్ కళాశాలల్లో

నేటినుంచీ ఇంటర్ ప్రాక్టికల్స్

● ఏర్పాట్లు పూర్తి చేశామన్న డీఐఈవో

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు బుధవారం నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 83 వొకేషనల్ జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు డీఐఈవో సయ్యద్ మౌల తెలిపారు.మూడు స్పెల్స్‌లో జరిగే ప్రాక్టికల్స్‌లో 12,311మంది ఒకేషనల్, బైపీసీ, ఎంపీసీ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. మొదటి సంవత్సరంలో 1908 మంది, రెండవ సంవత్సరంలో 2034 మంది ప్రాక్టికల్స్ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈనెల 9వ తేదీ వరకు 25 కళాశాలల్లో వొకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఆపై 20వ తేదీ వరకు 58 కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పకడ్బందీగా నిర్వహించేందుకు గాను సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. పరీక్షల కన్వీనర్‌గా డీఐఈవో, స్పెషల్ అధికారిగా దయానందరాజు, డీఈసీ మెంబర్లుగా శరత్‌చ్చంద్ర, బాలసుబ్రమణ్యం, నిర్మల, వెంకటరమణారెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. పరీక్షల సమయంలో ఇబ్బందులు ఉంటే 08572-293867 నంబరుకు తెలియజేయాలని చెప్పారు.

3 నుంచి ఎఫ్ఏ-4 పరీక్షలు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలలకు మార్చి 3 నుంచి 6వ తేదీ వరకు ఫార్మెటివ్ అసెస్మెంట్-4 పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు విడుదల చేసిన షెడ్యూల్ గురువారం జిల్లా విద్యాశాఖకు చేరింది. 1నుంచి5వ తరగతి వరకు 3న ఉదయం ఓఎస్ఎస్‌సీ, 4న ఉదయం, మధ్యాహ్నం తెలుగు, మ్యాథ్స్, 5న ఇంగ్లీష్, సైన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. 6 నుంచి 9వ తరగతి వరకు 3న ఉదయం, మధ్యాహ్నం ఓఎస్ఎస్‌సీ-1, ఓఎస్ఎస్‌సీ-2, 4న తెలుగు, మ్యాథ్స్, 5న హిందీ, జనరల్ సైన్స్, 6, ఇంగ్లీషు, సోషియల్ స్టడీస్ జరగనున్నాయి.





ఏడు వాహనాలపై కొండల స్వామి

తిరుమల,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సంబరాలతో మంగళవారం తిరుమల కొండ కిటకిటలాడింది. సప్త వాహన సేవలను తిలకించిన భక్తజనం తన్మయులయ్యారు. వేకువజాము 5.30 గంటలకు వాహన మండపం నుంచి సూర్యప్రభ వాహనంలో విశేష అలంకరణతో మలయప్ప స్వామి బయలుదేరాడు. వాయువ్య మూలలో వేంచేసి సూర్యోదయం కోసం ఎదురు చూశాడు. సరిగ్గా 6.48 గంటలకు రవి కిరణాలు స్వామిని తాకాయి. ఆ క్షణం కోసమే గ్యాలరీల్లో ఎదురు చూసిన భక్తజనం గోవిందనామస్మరణలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఆ తర్వాత ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య చిన్నశేషవాహనం,11-12మధ్య గరుడవాహనం, మధ్యాహ్నం 1-2 మధ్య హనుమంతవాహనం నిర్వహించారు. మధ్యాహ్నం 2-3 మధ్య పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరిగింది. అంతకుముందు వరాహస్వామి ఆలయం వద్ద చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు. అధికారులతో పాటు భక్తులు పుష్కరిణిలో పవిత్రస్నానాలు ఆచరించారు. తిరిగి సాయంత్రం 4-5 మధ్య కల్పవృక్ష వాహనం, 6-7 మధ్య సర్వభూపాల వాహనం, రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య చంద్రప్రభావాహనసేవలతో ఒక్క రోజు బ్రహ్మోత్సవాలు వేడుకగా ముగిశాయి.

మాడవీధులు కిటకిట

సోమవారం సాయంత్రం గ్యాలరీల్లోకి భక్తుల ప్రవేశం మొదలైంది. అర్ధరాత్రి ఉత్తరమాడవీధి పూర్తిస్థాయిలో నిండిపోగా, మంగళవారం వేకువజామునకు పడమర, దక్షణ, తూర్పు మాడవీధులు, శ్రీవారి ఆలయం ముందు భాగం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఎండకు, చలికి ఇబ్బంది లేకుండా మాడవీధుల్లోని గ్యాలరీలపై షెడ్లు వేయడంతో ముందు రోజు సాయంత్రం నుంచీ మంగళవారం రాత్రి దాకా భక్తులు ఒక్కో వాహనాన్ని తిలకిస్తూ కూర్చుండిపోయారు. టీటీడీ అన్నప్రసాదాలు, తాగునీరు అందించడంతో ఇబ్బందిలేకుండా గడిపారు. రాంభగీచ అతిథిగృహాల వద్ద మాత్రం యాత్రికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అక్కడక్కడ గేట్లకు తాళాలు వేయడంతో అగచాట్లు పడ్డారు.

కంగారు పెట్టిన గొడుగు



చిన్నశేష వాహనంలో గొడుగు జారడం అధికారుల్లో కంగారు పుట్టించింది. వాహనమండపం, పుష్కరిణి మధ్యలో వాహనబేరర్లు వాహనాన్ని పైకి, కిందకు ఊపుతూ వేగంగా నడవడంతో ఉత్సవమూర్తికి ఎడమవైపునున్న అర్చకుడి చేతి నుంచి గొడుగు కిందకు జారింది. అయితే వెంటనే అర్చకుడు అప్రమత్తమై గొడుగును పైకి ఎత్తి దాని స్థానంలో ఉంచడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు

రథసప్తమి సందర్భంగా టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేవిధంగా రాబోవురోజుల్లో కూడా ఏర్పాట్లు చేయాలని కోరారు. గ్యాలరీల్లోకి స్వయంగా వెళ్లి ఆరా తీస్తే తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని భక్తులు చెప్పారు. ఇంతమంచి ఏర్పాట్లు చేయడంతో పాటు అధికారులు, పోలీసులు, విజిలెన్స్, శ్రీవారిసేవకులు సమర్థంగా విధులు నిర్వహించారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

- బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు చైర్మన్

2.50 లక్షల మంది పాల్గొన్నారు

దాదాపు 2.50 లక్షల మంది భక్తులు పాల్గొని రథసప్తమి వాహన సేవలను వీక్షించారు. సోమవారం రాత్రికే దాదాపు 50 వేల మంది భక్తులు గ్యాలరీల్లోకి వచ్చారు. చాలా మంది ఏర్పాట్లపై మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి సమస్యలు రాలేదు. నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తున్నాం. మరుగుదొడ్ల ఏర్పాటుపై కూడా భక్తులు మంచి స్పందన ఇచ్చారు. రథసప్తమి విజయవంతం కావడం చాలా సంతోషంగా ఉంది.

- శ్యామలరావు, టీటీడీ ఈవో

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో

నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి తరగతి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్. శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి ఎర్రచందనం కోర్టు లైజన్ అధికారులు చంద్రశేఖరరాజు, రఘు తెలిపిన ప్రకారం.. డక్కిలి మండలం వెలికల్లుకు చెందిన మచ్చల గురునాథం 2012-13లో.. 18 ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తీసుకెళ్లడానికి కయ్యూరు చెరువులో దాచి ఉంచారు. ఈ విషయం తెలిసిన అటవీశాఖ అధికారులు ఆ దుంగలు స్వాధీనం చేసుకుని గురునాథంపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ శిరీష వాదనలు వినిపించారు. నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

లా ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో 2024 అక్టోబరులో నిర్వహించిన ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. స్కూల్స్9, మనబడి వెబ్‌సైట్లలో ఈ ఫలితాల చూడాలని సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఎంపీడీవోకు రూ.మూడేసి వేలు

ఎవరెవరు ఇస్తున్నారు?

- అవినీతి ఆరోపణలపై డ్వామా ఏపీడీ విచారణ



ఏపీడీ వరప్రసాద్

పెళ్లకూరు, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల బిల్లుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి నగదు వసూలు చేస్తున్నారన్నారంటూ వచ్చిన ఆరోపణలపై డ్వామా ఏపీడీ వరప్రసాద్ విచారణ చేపట్టారు. ఎంపీడీవోపై అవినీతి ఆరోపణలు చేసిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సర్పంచు గుంటపూడి పెంచలయ్య సమక్షంలో మంగళవారం మండల కార్యాలయంలో ప్రమీలారాణిని విచారించారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు చూపాలని మురళీకృష్ణారెడ్డిని ఏపీడీ కోరారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లను బహిరంగంగా విచారించారు. ఎంపీడీవోకు నెలకు రూ.3 వేలు చొప్పున ఎవరెవరు ఇస్తున్నారని ప్రశించగా, తాము ఇవ్వడంలేదని వారు చెప్పారు. విచారణాంశాలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని ఏపీడీ చెప్పారు.

మూడోసారీ.. హరిత పాఠశాల

- నారాయణవనం బాలికోన్నత పాఠశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు



ఢిల్లీలో ఉత్తమ హరిత పాఠశాల అవార్డును అందుకుంటున్న శ్యామలత


నారాయణవనం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని బాలికోన్నత పాఠశాల 2024-25 సంవత్సరానికిగాను మూడోసారి కూడా హరిత పాఠశాలగా ఎంపికై జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినట్టు ప్రధానోపాధ్యాయురాలు శశికళ తెలిపారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన నేషనల్ గ్రీన్ కోర్, సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ ఆధ్వర్యంలో ఉత్తమ హరిత పాఠశాల అవార్డును సీఎస్ఈ డైరెక్టర్ జనరల్ సునీత నరేన్ చేతుల మీదుగా పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ కె.వి.శ్యామలత అందుకున్నారు. పాఠశాలలో వ్యర్థాల నిర్వహణ, ఇంకుడు గుంత ద్వారా వర్షం నీటి నిల్వ, విద్యార్థుల పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటించడం, పచ్చదనం పెంచడం, విద్యుత్ ఆదా వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని హరిత పాఠశాల అవార్డు ఇచ్చారు. ఏపీ ఎన్‌జీసీ డైరెక్టర్ వి.స్రవంతి, డీఈవో కేవీఎన్ కుమార్, డీవైఈవో ప్రభాకర్ రాజు, ఏపీ రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠ తదితరులు ఉపాధ్యాయులను అభినందించారు.

బందోబస్తు సిబ్బందికి ధన్యవాదాలు

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందికి అనంతపురం రేంజ్ డీఐజీ షేమోషీ, ఎస్పీ హర్షవర్ధనరాజు శుక్రవారం రాత్రి ఓ ప్రకటన ద్వారా ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 1,400 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాహనసేవలు జరిగాయని పేర్కొన్నారు. యాంటీ సబటేజ్ చెక్, ఫ్రిస్కింగ్, క్రౌడ్ కంట్రోల్, ట్రాఫిక్ నియంత్రణ వంటి చర్యలు చేపట్టామన్నారు. విజిలెన్స్‌తో సమన్వయం చేసుకుని చిన్నఘటన కూడా లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

సొంతూరి సేవలో అపోలో ప్రతాప రెడ్డి

● అరగొండలో ఆస్పత్రి, స్కూళ్లు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు ● నేడు 93వ వడిలోకి అపోలో చైర్మన్





అరగొండలోని టోటల్ హెల్త్ ట్రస్టు కార్యాలయం - అపోలో హాస్పిటల్,నర్సింగ్ కళాశాల

తవణంపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భారత వైద్య రంగంలో చిరపరిచితులైన అపోలో ప్రతాపరెడ్డి తన జన్మస్థలమైన అర గొండకూ విలువైన సేవలందిస్తున్నారు. తవణం పల్లె మండలంలోని అరగొండలో 1933 ఫిబ్ర వరి 5వ తేదీన జన్మించిన ఆయన అక్కడే ప్రాథమిక విద్యను అభ్యసించారు. చిత్తూరులోని కట్టమంచి రామలింగారెడ్డి పాఠశాలలో హైస్కూలు విద్యను పూర్తి చేశాక మద్రాస్ క్రిస్టి యన్ కాలేజీలో ఇంటర్ చదివారు.మెడిసిన్ తరువాత అమెరికాలో కార్డియాలజీ ఎండీ చది విన ఆయన అక్కడే 20 ఏళ్ల పాటు సేవలందిం చారు.తండ్రి రాఘవరెడ్డి సూచన మేరకు ఇండియా తిరిగి వచ్చిన ఆయన మద్రాసులోని ఓ ఆస్పత్రిలో కార్డియాలజిస్టుగా చేరారు. అనం తరం 1983 సెప్టెంబరు 18వ తేదీన చెన్నైలో అపోలో హాస్పిటల్ ప్రారంభించారు.ఆ తరువాత అపోలో ఆస్పత్రులను దేశవ్యాప్తంగా విస్తరించా రు.పుట్టిన గడ్డకు కూడా వైద్యసేవలందించేం దుకు 2000వ సంవత్సరంలో అరగొండలో అపోలో ఆస్పత్రిని ప్రారంభించారు. అప్పటి సీఎం చంద్రబాబు ఆస్పత్రి ప్రారంభోత్సవానికి హాజరయ్యారు.గ్రామీణ ప్రాంతాలకూ టెలీ మెడి సిన్ విధానాన్ని పరిచయం చేశారు.ఆస్పత్రికి అనుబంధంగా 2013లో అపోలో బీఎస్సీ నర్సింగ్ కాలేజీని ప్రారంభించారు.ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాల విద్యార్థినులు కూడా ఇక్కడ చదువు కుంటున్నారు. ఇషా, అపోలో సంయుక్తంగా అర గొండలోనే 1 నుంచి 10వ తరగతుల వరకు 'అపోలో ఇషా విద్యానికేతన్' పాఠశాలను స్థాపించి నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. సొంత మండలం తవణంపల్లెతో పాటు బంధు వర్గం ఉన్న ఐరాల మండల ప్రజల కోసం 'టోటల్ హెల్త్' పేరిట ట్రస్టును ఏర్పాటు చేశారు. ఈ రెండు మండలాల్లో మారుమూల ప్రాంతాలకూ వెళ్లి ప్రజలకు ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధుల్ని గుర్తిస్తున్నారు. అవసరమైన వైద్య సేవల్ని తక్కువ ఖర్చుతో అందిస్తున్నారు. ఈ ట్రస్టు ఆధ్వర్యంలోనే అర గొండలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటరును ఏర్పాటుచేశారు. గ్రామీణ నిరుద్యోగ యువతకు టైలరింగ్, ఏసీ మెకానిజం తదితరాలపై స్టైపం డ్‌తో కూడిన శిక్షణ ఇస్తున్నారు.అరగొండలోని పురాతన స్వయంభు భువనేశ్వరాలయాన్ని, రామాలయాన్ని పునరుద్ధరించిన ఆయన ఏడా దిలో రెండు సార్లు సొంతూరుకు వచ్చినప్పుడు ఈ ఆలయాలను సందర్శిస్తారు.



అపోలో ఇషా విద్యానికేతన్ పాఠశాల

విద్యుత్‌శాఖలో పదోన్నతి పొందిన అధికారులకు పోస్టింగులు

చిత్తూరు రూరల్ ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పదోన్నతి పొందిన అధికారులకు పోస్టింగులు ఇస్తూ సీఎండీ సంతోష్‌రావు మంగళ వారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా స్టోర్స్ డీఈగా ఉన్న బాలాజీ పదోన్న తిపై ఈఈగా కార్పొరేట్ కార్యాలయంలోని క్వాలిటీ కంట్రోల్ విభాగానికి బదిలీ అయ్యారు. జిల్లా స్టోర్స్ డీఈగా కార్పొరేట్ కార్యాలయ డీఈ వసంత నాయుడిని నియమించారు. అలాగే ఐరాల రూరల్ ఏఈ బాలాజీని పదోన్న తిపై డీఈగా పుట్టపర్తి డివిజన్‌కు బదిలీ చేశారు.

ఎస్సీ వర్గీకరణపై చంద్రబాబు వేసిన మిశ్రా కమిషన్ను రద్దు చేయాలి

● బ్యాంకు రుణాల్లో ఎస్సీలకు 15, ఎస్టీలకు 7.5 శాతం ఇవ్వాలి
● మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్



చింతా మోహన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై చంద్ర బాబు వేసిన మిశ్రా కమి షన్ను వెంటనే రద్దు చేయాలని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. మంగ ళవారం నగరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు బ్యాంకు రుణాల్లో రిజర్వేషన్ కల్పించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో అనుభవం ఉందని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు దళితుల విషయంలో వేలు పెట్టడం కరెక్ట్ కాదని, అలా చేయడం ఆయనకే నష్టమని అన్నారు. 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు చిత్తూరు జిల్లాను ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. చిత్తూరు నగర అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వెనకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలన్నారు. బ్యాంకుల రుణాల్లో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5, బీసీలకు 27 శాతం రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకులకు వెళ్లిన ప్రతి విద్యార్థికీ, ప్రతి నిరుద్యోగికీ, రైతుకూ రుణాలు మంజూరు చేయా లని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపీ, శంకరయ్య, భరత్‌కుమార్, వేణు, భువనేశ్వరి, పార్వతి, ఎర్రయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ఆర్థిక విధ్వంసం : టీడీపీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ ఆరోపించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో చేసిన లక్షల కోట్ల అప్పులన్నీ జగన్ రెడ్డి కుటుంబానికి, వైసీపీ నాయకుల విలాసాలకే ఖర్చు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాలా తీయించారని ఆరోపించారు. జగన్ రెడ్డి ప్రభుత్వం చేసిన రూ.10 లక్షల కోట్ల అప్పుకు అసలు వడ్డీ కలిపి ఏడాదికి రూ.71 వేల కోట్లు చెల్లింపులు చేయాల్సిన భారం కూటమి ప్రభుత్వంపై పడిందని అన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులను జగన్ ప్రభుత్వం ముందుగానే వాడేసిందన్నారు. చివరకు అప్పులు కూడా పుట్టని పరిస్థితికి రాష్ట్రాన్ని నెట్టివేశారన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తప్పకుండా అమలు చేసి తీరుతుందని చెప్పారు. కార్యక్రమంలో నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, మేషాక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీ రిజిస్ట్రార్‌గా వెంకట నారాయణరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా కడియం వెంకట నారాయణరావు నియమి తులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ ఆర్ కృష్ణమూర్తి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో రిజిస్ట్రార్‌గా నారాయణరావు మంగళవారం బాధ్యతలు స్వీక రించారు. వీసీ కృష్ణమూర్తి, డీన్ ప్రొఫెసర్ రమాకాంత్ శుక్లా, అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు అభినందించారు.

10 మద్యం దుకాణాలకు 11దరఖాస్తులే

ఆసక్తి చూపని కల్లుగీత కార్మికులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 10 మద్యం దుకాణాలకు మంగళవారం రాత్రి వరకు 11 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణకు 5వ తేది సాయంత్రం 5గంటల వరకు గడువు ఉంది.కల్లుగీత కార్మికులు మద్యం దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి చూపడంలేదు.50 శాతం రాయితీ ఇచ్చినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. ప్రస్తుతం నడుస్తున్న మద్యం దుకాణాల్లో ప్రభుత్వం గెజిట్‌లో ప్రకటించిన విధంగా ఎంఆర్‌పీలో 20 శాతం ఆదాయం అమలు కావడంలేదు. దీంతో ఇప్పుడు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేవారు కూడా ఆలోచిస్తున్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలో చిత్తూరు ఎక్సైజ్ అర్బన్ స్టేషన్‌లో మంగళవారం కల్లుగీత కులాలకు సంబంధించిన నాయకులతో డీసీ విజయ్ శేఖర్ సమావేశం నిర్వహించారు. ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. లైసెన్స్ ఫీజులో కూడా 50 శాతం రాయితీ ఇచ్చిందని చెప్పారు. ఈ అవకాశాన్ని కల్లుగీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఒక్కరోజే....రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.1.60 కోట్లు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్ కొత్త విలువలు శనివారం నుంచి అమల్లోకొచ్చాయి. గతనెల 31వ తేది వరకు అమల్లో వున్న పాత విలువలతో గత శుక్రవారం వరకు చిత్తూరు రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలోని ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ల రిజిస్ట్రే షన్లు జరిగాయి. చివరిరోజు కావడంతో శుక్రవారం ఒక్కరోజే 345 రిజిస్ట్రే షన్లు జరిగి ప్రభుత్వ ఖజానాకు రూ.1,60,87,360 ఆదాయం అందింది. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేశాఖల్లో రిజిస్ట్రేషన్‌శాఖ ఒకటి. ఒక్కరోజే రూ.1.60 కోట్ల ఆదాయం రావడం ఓ రికార్డుగా రిజిస్ట్రేషన్ వర్గాలు తెలి పాయి. ఎస్‌ఆర్‌ల లెక్కలవారీగా చిత్తూరు ఆర్వోలో 61 డాక్యుమెంట్ల రిజిస్ట్రే షన్ ద్వారా రూ.44.72లక్షలు, చిత్తూరు రూరల్ ఎస్‌ఆర్‌లో 41 డాక్యుమెం ట్లతో రూ.29.80 లక్షలు, కార్వేటినగరంలో 22కు గాను రూ.2,72,730, నగ రిలో 33కు గాను రూ.29,94,378, పలమనేరులో 38కి గాను రూ.24,12,850, పుంగనూరులో 62కు గాను రూ.9,32,215, కుప్పంలో 78కి గాను రూ.17,07,365, బంగారుపాళ్యం ఎస్‌ఆర్‌లో 14కు గాను రూ.3,45,500 ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఉచిత గ్యాస్‌కు అనర్హుల జాబితా డీలర్లకు పంపిస్తాం

● జేసీ విద్యాధరి



గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులకు సూచనలిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరుకలెక్టరేట్,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపం - 2 పథకం కింద అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల రాయితీ సొమ్మును కూటమి ప్రభుత్వం ఎప్పటికప్పుడు జమచేస్తోందని జేసీ విద్యాధరి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లాస్థాయి గ్యాస్ ఏజెన్సీ ప్రతిని ధులతో తన ఛాంబర్‌లో జేసీ విద్యాధరి అధ్య క్షతన సమావేశం జరిగింది. ఆమె మాట్లా డుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2025 మార్చి వరకు ఒక సిలిండర్ ఉచితంగా పొందడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిం దన్నారు. తాజా లెక్కల ప్రకారం 5.40 రేషన్ కార్డులుండగా 3.26 లక్షల రేషన్‌కార్డుదారుల బ్యాంకు ఖాతాలకు రూ.26.23 కోట్లు రాయితీ సొమ్ము జమచేసినట్లు చెప్పారు. పలువురు గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు మాట్లాడుతూ.. గ్యాస్ డీలర్లకు ఉచితంగా సిలిండర్ పొందే అర్హుల జాబితాను మాత్రమే అధికారులు ఇచ్చారని, అనర్హుల జాబితా అందించకపో వడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నట్లు తెలిపారు. అందుకు జేసీ సమాధాన మిస్తూ ఆధార్, బ్యాంకు ఖాతా అనుసం ధానం కాకపోవడం, ఈకేవైసీ ప్రక్రియ చేయక కొన్ని బ్యాంకు ఖాతాలు బ్లాక్ కావ డంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉచిత గ్యాస్ బుక్‌చేసుకుని, రాయితీ సొమ్ము పడని లబ్ధిదారుల వివరాలను వారి రేషన్ కార్డు నెంబరుతో డీఎస్వో కార్యాలయానికి వాట్సప్ గ్రూప్ ద్వారా పంపితే, అందుకు గల కారణా లను తెలియజేస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి బుధవారం నుంచి గ్యాస్ డీల ర్లతో కూడిన వాట్సప్ గ్రూపును ఏర్పాటు చేయాలని డీఎస్వో శంకరన్‌ను జేసీ ఆదేశిం చారు. నాలుగు చక్రాల వాహనం, ఆదాయ పన్ను చెల్లింపు, నెలకు 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం, పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగుల్లో ఇల్లు, పల్లెల్లో పదె కరాలకన్నా ఎక్కువ పొలం ఉంటే ఉచిత గ్యాస్‌కు అర్హత ఉండదన్నారు. సిలిండర్లను పంపిణీచేసే డెలివరి బాయ్స్ వినియోగదా రుల నుంచి నిర్ణీత ధరకంటే మించి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలాంటి డెలివరి బాయ్స్ ఉన్న డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎస్వో శంకరన్‌తో పాటు 47 మంది గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.9కోట్లతో హాస్టళ్ల మరమ్మతులు

డీడీ చెన్నయ్య



ఎస్సీబాలుర కళాశాల హాస్టల్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డీడీ చెన్నయ్య

వెదురుకుప్పం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.9కోట్లతో హాస్టళ్ల మరమ్మతు పనులు చేపడుతున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య వెల్లడించారు. మంగళవారం కార్వేటిన గరంలోని మూడు హాస్ట ళ్లను డీడీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మరమ్మతులకు గురైన హాస్టళ్లను గుర్తించామని చెప్పారు. వీటి మరమ్మ తులకు ప్రభుత్వం నుంచి రూ.8.60 కోట్లు వచ్చాయని, మరో రూ.40లక్షలను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు నిధుల నుంచి ఇచ్చారని, దీంతో రూ.9 కోట్లతో మరమ్మతులను చేపడుతు న్నట్లు చెప్పారు. ఈ క్రమంలో మరుగుదొడ్లు, ఉరుస్తున్న భవనాలు, కిటికీలు, విద్యుత్ వైరిం గ్‌లు, తాగునీటి వసతి సదుపాయాల(లీకేజీ) మరమ్మతులు, తలుపుల ఏర్పాటు చేయిస్తా మన్నారు. ఈ పనులు త్వరలో ప్రారంభమవు తాయన్నారు. కార్వేటినగరంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ మరమ్మతులకు రూ.60 లక్షలు, ఎస్సీ బాలుర హాస్టల్ మరమ్మతులకు రూ.40 లక్షలు, ఎస్సీ కళాశాల హాస్టల్ మరమ్మతు లకు రూ.18.50 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఈఈ మురళీధర్‌రెడ్డి, ఏఈ సుబ్ర హ్మణ్యంరెడ్డి, ఏఎస్‌డబ్ల్యు శ్రీనివాసులు, వసతి గృహ సంక్షేమ అధికారులు(వార్డెన్లు) హేమలత, దశరథన్, సుబ్బరత్న, పార్థసారథి, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐటీలో ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు



ఐఐటీ వద్ద ఈశాన్య రాష్ట్రాల విద్యార్థుల గ్రూపు ఫొటో



విద్యార్థులతో మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాల నుంచి 25మంది విద్యార్థుల బృందం ఎస్‌ఈఐ ఎల్(ఇంటర్ - స్టేట్ లివిం గ్‌లో విద్యార్థుల అనుభవం) కార్యక్రమం కింద వారి జాతీయ సమైక్యత పర్యటనలో భాగంగా తిరు పతి ఐఐటీ క్యాంపస్‌ను మంగళవారం సంద ర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ సాంస్కృ తిక, సంప్రదాయ పద్ధతులను అర్థం చేసుకోవ డానికి, అధ్యాయనం చేయడానికి, పరిచయం చేసుకోవడానికి ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. వారికి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కే.ఎన్. సత్యనా రాయణ తదితరులు స్వాగతం పలికారు. జాతీయ సమైక్యత, సాంస్కృతిక మార్పిడి ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఐఐటీలోని అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక సదుపా యాలు, వివిధ సాంకేతిక సౌకర్యాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారా యణ మాట్లాడుతూ... ఎస్‌ఈఐఎల్ కార్యక్రమం కింద జాతీయ సమైక్యత పర్యటన, విభిన్న నేప థ్యాల నుంచి విద్యార్థుల్లో ఐక్యత, అవగాహన పెంపొందించడం, దేశ బంధాలను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడగా ఒకరు మృతి చెందారు. ఈ ఘటన తొట్టం బేడు మండలం బసవయ్యపాళెం సమీ పంలో జాతీయ రహదారిపై మంగళ వారం జరిగింది. తిరుపతి ఆటోనగర్‌కు చెందిన మురళి సెకెండ్‌హ్యాండ్ కార్లను విక్రయిస్తుంటాడు.ఆయన భార్య శ్యామల, కవల పిల్లలైన హాసిని, హర్షిణి(13)తో కలిసి నెల్లూరులోని బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లారు. మంగళవారం సాయంత్రం తిరుగు ప్రయాణమ య్యారు. వేలూరుకు చెందిన ఓ వ్యాపారి కుటుంబంతో నెల్లూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో తొట్టంబేడు మండలం బసవ య్యపాళెం వద్ద పూతలపట్టు - నాయుడు పేట జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో తిరుపతికి చెందిన మురళి, భార్య శ్యామల, కుమార్తెలు హాసిని, హర్షిణి గాయపడ్డాడు. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వ ఏరియా ఆస్ప త్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ హర్షిని మృతి చెందింది.

కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల సమ్మె



వర్సిటీ ప్రవేశద్వారం వద్ద బైఠాయించిన విద్యార్థులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా తమకు ఉప కారవేతనం అందించాలని కోరుతూ తిరుపతి లోని ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేప ట్టిన నిరవధిక సమ్మె రెండవ రోజు మంగళ వారం కూడా కొనసాగింది. దీనిలో భాగంగా వర్శిటీ ప్రవేశ ద్వారం ఎదుట విద్యార్థులు బైఠాయించి దీక్ష కొనసాగించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వానికి సమస్యను వివరిస్తే పట్టించుకో లేదన్నారు. కూటమి ప్రభుత్వమైనా న్యాయం చేస్తుందని ఎదురుచూస్తున్నామని తెలిపారు. మూడు నెలల క్రితం పశుసంవర్ధకశాఖ ప్రిన్సి పల్ సెక్రటరీ ఎంఎం నాయక్‌కు విన్నవించినా ప్రభుత్వం స్పందించక పోవ డంతో నిరవధికదీక్షకు దిగా మన్నారు. అల్లోపతి, హోమి యోపతి, ఆయుర్వేదిక్, డెంటల్ విద్యార్థులతో సమా నంగా తమకు ఉపకారవే తనం పెంచుతూ జీవో విడు దల చేయాలని కోరారు. విద్యార్థుల దీక్షా శిబిరాన్ని వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, డీఈ డాక్టర్ శోభామణి, సీవోఈ డాక్టర్ చెంగల్వరా యులు, ఏడీ డాక్టర్ జగపతిరామయ్య, ఓఎస్ ఏ డాక్టర్ వేణు సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. దీక్ష విరమించి తరగతులకు హాజరుకావాలని కోరారు. ప్రభుత్వం జీవో విడుదల చేసేవరకు దీక్ష విరమించేదిలేదని తేల్చిచెప్పడంతో అధికారులు వెనుదిరిగారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించండి

● డీఆర్వో సూచన



ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం నుంచి ఈనెల 20 వరకు నిర్వహించే ప్రాక్టి కల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో మోహన్‌కుమార్ అధికారు లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్ పక్కన గల సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. డీఆర్వో మాట్లాడుతూ బుధ వారం నుంచి ఈనెల 20వరకు మూడు విడతల్లో ఫస్ట్, సెకండియర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు 69 కేంద్రాల్లో జరుగుతాయన్నారు. ఫస్టియర్, సెకండియర్ ప్రాక్టి కల్ పరీక్షలకు 12,311 మంది విద్యార్థులు హాజరౌతున్నట్లు చెప్పారు. వొకేషనల్ గ్రూపుకు సంబంధించి బుధవారం నుంచి ఈనెల 9వ తేది వరకు 11 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరుగకుండా నిషేధపు ఆజ్ఞలు విధించి చర్యలు చేపట్టాలన్నారు. పరీ క్షలకు సకాలంలో విద్యార్థులు హాజరయ్యే విధంగా బస్సు సర్వీసులు నడపాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాల న్నారు. ప్రాక్టికల్స్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇంటర్ ఆర్ఐవో సయ్యద్ మౌలా, స్పెషల్ ఆఫీసర్ దయానంద రాజు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు విక్రయించాలి


ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు విక్రయించాలని చిత్తూరు, రైతు శిక్షణ కేంద్రం ఏడీ ఈలు నాగపద్మిని, ప్రసన్నలక్ష్మీ డీలర్లను ఆదేశించారు. మంగళవారం పుంగనూరులోని ఆగ్రోలైఫ్ సైన్స్, అన్నదాత ట్రేడర్స్ భీమగానిపల్లె రైతుసేవా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎరువులు, క్రిమిసంహార మందులు, విత్తనాల నిల్వలు, ధరల పట్టిక, రైతులకు అందజేస్తున్న విక్రయాల బిల్లులను పరిశీలించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయించినా.. రైతులకు కొనుగోలు చేసిన ఎరువులు, మందులకు బిల్లులు ఇవ్వని వారి లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వారి వెంట ఏవో రాజేశ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

7న చలో హైదరాబాదు విజయవంతం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పుంగనూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న హైదరాబాదులో నిర్వహించే లక్షల డప్పులు- వేల గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ నరసింహులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ అనేక ఉద్యమాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుకూలంగా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడానికి ఏపీలో వన్‌మ్యాన్ కమిషన్ వేసినట్లు చెప్పారు. కమిషన్ రాష్ట్రంలోని 13 జిల్లాలో పర్యటించి షెడ్యూల్ కులాల జీవన స్థితిగతులు, ఆర్థిక స్థితిగతులపై పరిశీలించారన్నారు. హైదరాబాదులో జరిగే కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, ప్రభాకర్, గోవిందు, బాబు, హరిబాబు, నరసింహులు, సూరి, లక్ష్మన్న, శ్రీరాములు, గంగులప్ప, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంటుకట్టే విధానంతో నాణ్యమైన దిగుబడులు


టమోటాలో అంటుకట్టే విధానాన్ని పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారులు

కుప్పం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వివిధ కూరగాయల నార్లకు అంటుకట్టే విధానాన్ని రైతులు అవలంబించడంతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉద్యాన రైతులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇండో-ఇజ్రాయెల్ కూరగాయలలో అంటు కట్టే విధానాన్ని రైతులచే చేయించారు. టమోటా, వంగ, మిరప తదితర రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గంగవరం మండలంలోని గ్రీన్ ఆర్బిట్ ఫాంలో హైడ్రోపోనిక్స్ యూనిట్‌లో లెట్యూస్, పెల్లరీ సాగు విధానంపై వివరించారు. గ్రీన్ ఆర్బిట్ అధినేత శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి ఎంబస్సె బ్రహ్మదేవ్, కుప్పం, శాంతిపురం ఉద్యానాధికారులు డింపుప్రియ, వింధ్యా, సిబ్బంది, పాల్గొన్నారు.

రాతి మసీదు నూతన అధ్యక్షుడిగా బాబాఫక్రుద్దీన్ ఎంపిక


కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు రాతి మసీదు ముతవల్లీ, నూతన కమిటీ అధ్యక్షుడిగా బాబాఫక్రుద్దీన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మంగళవారం జరిగిన కమిటీ సమావేశంలో నూతన మసీదు కమిటీని ఎంపిక చేసి రొంపిచెర్లలోని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కలిసి నియమకపత్రాన్ని అందుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బాబాఫకృద్దీన్, ఉపాధ్యక్షుడిగా నౌషాద్, కార్యదర్శిగా సద్దాంహుస్సేన్, జాయింట్ సెక్రటరీగా బి.అంజాద్‌బాషా, కోశాధికారిగా యూసఫ్, జాయింట్ ట్రెజరర్‌గా డాక్టర్ స్వామి, కమిటీ సభ్యులుగా రియాజ్, అనిస్, నిస్సార్ అహ్మద్, యూసఫ్, అష్రఫ్ అలీతో కలిపి 11 మందిని ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి నూతన కమిటీని అభినందించి మసీదు అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సుహేల్‌బాషా, మండల ఖాజీ మౌలానా అజాద్, మతపెద్దలు పాల్గొన్నారు.

రోడ్డును దున్నేశారని ఫిర్యాదు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రోడ్డును కొందరు ట్రాక్టర్‌తో దున్నేసి రోడ్డులేకుండా చేశారని.. న్యాయం చేయాలని బాధిత రైతులు మంగళవారం తహసీల్దార్ రాముకు ఫిర్యాదు చేశారు. పుంగనూరు మండలం చదళ్ల పంచాయతీ చెర్లోపల్లెకి చెందిన రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు బండిబాటను వెడల్పు చేయాలని కోరగా 2020లో ఉపాధిహామీ నిధులు రూ.4.70 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టారన్నారు. పుంగనూరుకు చెందిన ఫయాజ్, నవాజ్, సురేంద్ర, అశోక్, బాబు కలిసి రోడ్డును ట్రాక్టర్‌తో చదును చేశారని వాపోయారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు తపాలలో ఫిర్యాదు పంపారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, రంగప్రసాద్, రెడ్డెప్ప, నారాయణ, సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. పుంగనూరు ఏటిగడ్డపాళ్యానికి చెందిన రాజు, కృష్ణప్ప నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడులు చేశారు. 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా ఉట్లోత్సవం


ఉట్లోత్సవంలో పాల్గొన్న యువకులు

చౌడేపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా చారాలలో వెలసిన అన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఆలయం వద్ద జరిగిన ఉట్లోత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ కార్యదర్శిని వెంటనే విడుదల చేయాలి

పుంగనూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలపై నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మాధవ్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్రసమితి సభ్యులు మున్నా డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రిని ప్రైవేటీకరణ చేయరాదనే డిమాండుపై నిరసన చేయడం తప్పా అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో వినతి పత్రాలు తీసుకున్నారని, మదనపల్లెను అభివృద్ధి చేస్తామని చెప్పి మాట మరిచిపోయారా అని ప్రశ్నించారు. విద్యార్థి సంఘ నాయకులను అనవసరంగా అరెస్ట్ చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు.

మారేడుపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్ ' తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న సెంట్రల్ హెల్త్ మిషన్ టీమ్ సభ్యులు

గంగవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేడుపల్లెలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం సెంట్రల్ హెల్త్‌మిషన్ టీమ్ సభ్యులు డాక్టర్ పర్వీన్ సుల్తాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, వైద్యసలహాలపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. 104 వాహనంలో ఈసీజీ మిషన్ పనితీరును పరిశీలించారు. ప్రజలకు సరైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిర్వాహక టీకాల అధికారి హనుమంతరావు, డాక్టర్లు జానకీరావు, శిరీష, ప్రసాద్, మండల వైద్యాధికారి శ్రీనివాసులు, సూపర్‌వైజర్ జ్యోతీశ్వర్ పాల్గొన్నారు

చెల్వరాయస్వామి బ్రహ్మోత్సవ క్యాలెండర్ల ఆవిష్కరణ


బ్రహ్మోత్సవ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ధర్మకర్తలు

గంగవరం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలోని కొలమాసనపల్లెలో వెలసిన చెల్వరాయస్వామి వారి బ్రహ్మోత్సవ క్యాలెండర్లను మంగళవారం ఆలయ ధర్మకర్తలు ఆవిష్కరించారు. ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు కొలమాసనపల్లె, పరిసర ప్రాంత ప్రజలు కుటుంబసమేతంగా హాజరు కావాలని కోరారు.

మంత్రి నిమ్మలకు సన్మానం



కుప్పం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కుప్పం గంగమ్మ గుడి ఆలయ మాజీ చైర్మన్ బీఎంకే రవిచంద్రబాబు కుమార్తె వివాహానికి రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కుప్పం టీడీపీ నేతలు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, టీడీపీ నేతలు ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, ప్రతాప్, ఉదయ్‌కుమార్, విశ్వనాథ నాయుడు, మణి, చంద్రశేఖర్, అనసూయమ్మ పాల్గొన్నారు.

14న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం

గుడుపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ సమావేశం ఈ నెల 14వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సీతారామ్ తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

నాభ్ గుర్తింపు దిశగా.. ఆయుర్వేద వైద్యశాల!


కుప్పంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల

● నామ్‌తో సదుపాయాల కల్పన



వైద్యశాల ఆవరణలో పెంచుతున్న ఔషధ వనం

కుప్పం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఆఫ్ హాస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్, నాభ్) గుర్తింపు కోసం కుప్పం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సిద్ధమవుతోంది. గుర్తింపు రావడానికి అవసరమైన సదుపాయాల కల్పన ప్రస్తుతం జరుగుతోంది. నాభ్ గుర్తింపు వచ్చిందంటే జాతీయ స్థాయిలో ఆయుర్వేద వైద్యశాలకు గుర్తింపు లభించినట్లవుతుంది.

కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని ఒక చిన్ని గదిలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల గతంలో కొనసాగేది. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకం అనువర్తించడంతో ఇటీవల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలోనే నూతన భవనాన్ని నిర్మించి అందులోకి ఆయుర్వేద వైద్యశాలను మార్చారు. విద్యా సంస్థలకు న్యాక్ కమిటీ ఉన్నట్లే వైద్య శాలలకు సైతం నాభ్ (ఎన్ఏబీహెచ్) కమిటీ ఒకటి ఉంది. రోగులకు అవసరమైన అన్నిరకాల సదుపాయాలతో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించే ప్రభుత్వాసుపత్రులకు నాభ్ గుర్తింపును ఇస్తుంది. నాభ్ గుర్తింపునకు ముందుగా ఆసుపత్రుల్లోని సౌకర్యాలను మెరుగుగు పరచాలి. అన్నిరకాల సదుపాయాలు చేసిన తర్వాత నాభ్ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్నాక నాభ్ కమిటీ ఆసుపత్రి తనిఖీకి వచ్చి సంతృప్తి పడితే వారి ప్రమాణాలను అనుసరించి గుర్తింపు లభిస్తుంది. ఈ దిశగా కుప్పం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మెల్లగా అడుగులు వేస్తోంది.

● నామ్‌తో సదుపాయాల కల్పన

ఆంధ్రప్రదేశ్‌లో మొదటి విడతలో ఇప్పటికే 90 ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలు నాభ్ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. రెండో విడతలో మరో 36 ఆయుర్వేద వైద్యశాలలు ఈ గుర్తింపుకోసం సిద్ధమవుతున్నాయి. వీటిలో కుప్పంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల కూడా ఒకటి. నాభ్ గుర్తింపునకు ప్రధానమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం నేషనల్ ఆయుష్ మిషన్ ఈ వైద్యశాలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకానికి ఎంపిక చేసింది. ఈ పథకం కింద ప్రత్యేకమైన నిధులను కేటాయించి అవసరమైన సదుపాయాలను కల్పిస్తోంది. ఆసుపత్రిలో టేబుళ్లు, కుర్చీలు వంటి ఫర్నీచర్ సిద్ధమైంది. యోగా, ధ్యానం చేసుకునేందుకు ప్రత్యేకంగా విశాలమైన హాలు ఉంది. అలాగే నాభ్ గుర్తింపు పొందాలంటే ప్రత్యేకంగా ఆయుర్వేద ఆసుపత్రి ఆవరణలోనే 16 రకాల ఔషధ మొక్కలు పెంచాల్సి ఉంది. దీనికి అనుగుణంగా ఆమ్లకి (ఉసిరి), అశ్వగంధ (పెన్నేరు గడ్డ), గుడూచి (తిప్పతీగ), హరిద్ర (పసుపు), నింబ (వేప), శతావరి (పిల్లిపీచర గడ్డ) ఏరండ (ఆముదం) వంటి మొత్తం 16 మొక్కలు ప్రస్తుతం కుప్పం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆవరణలో పెంచుతున్నారు. ఇంకా కొంత ఫర్నీచర్, ఇతర సదుపాయాలకు సంబంధించి సరంజామా వైద్యశాలకు రావాల్సి ఉంది. వాటి కోసం ప్రస్తుతం ఎదరు చూస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం 36 ఆయుర్వేద వైద్య శాలలలో సైతం ఇటువంటి మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోంది. పూర్తి స్థాయిలో సౌకర్యాలు మెరుగుపడిన తర్వాత నేషనల్ ఆయుష్ మిషన్ కమిషనర్‌తో నాభ్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి లభిస్తుంది. ఆ తర్వాతనే నాభ్ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే తొలివిడతలో దరఖాస్తు చేసుకున్న ఆయుర్వేద వైద్యశాలను ఇంతవరకు కమిటీ సందర్శించలేదు. రెండో విడతలో ఎంపికైన కుప్పం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఆయుష్మాన్ భారత్ కింద ఇంకా సదుపాయాల కల్పన జరుగుతున్నందున దరఖాస్తు చేసుకోవడానికే మరింత ఆలస్యం అనివార్యమవుతుంది. అయితే ఒకసారి నాభ్ కమిటీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి గుర్తింపు ఇచ్చిందంటే జాతీయ స్థాయి జాబితాలో కుప్పం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చేరుతుంది. అంటే మెరుగైన వైద్య, మౌలిక సదుపాయాలు కలిగిన ప్రతిష్ఠాత్మక ఆసుపత్రిగా గుర్తింపు వస్తుంది. ఈ దిశగా ఇప్పుడు ఆయుర్వేద వైద్యశాలలో కసరత్తు జరుగుతోంది.

సదుపాయాలు కల్పిస్తున్నాం



నాభ్ గుర్తింపు రావాలంటే నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఆసుత్రిలో అన్నిరకకాల మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు ఉండాలి. ఆయుష్మాన్ భారత్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పథకం కింద నేషనల్ ఆయుష్ మిషన్‌తో అందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రస్తుతం ఆసుపత్రిలో జరుగుతున్నాయి. ఇప్పటికే ఆసుపత్రి ఆవరణలో 16 రకాల ఔషధ మొక్కలతో ఔషధ వనం పెంచుతున్నాం. ఇంకా కొంత ఫర్నీచర్ రావాల్సి ఉంది. నామ్ చెప్పాకే నాభ్ గుర్తింపు కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

- డాక్టర్ హేమలత, వైద్యాధికారి, కుప్పం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల

క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి


రొంపిచెర్లలో వైద్య సిబ్బంది ర్యాలీ



సదస్సును ప్రారంభిస్తున్న పీఈఎస్ మెడికల్ సూపరింటెండెంట్ సుబ్బారావు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పుంగనూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాల డాక్టర్ పద్మాంజలి సూచించారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గ్రామీణ ప్రాంత ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, రోగులకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ సోకిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో డాక్టర్ అనురాధ, సూపర్‌వైజర్ భారతి, సిబ్బంది మమత తదితరులు పాల్గొన్నారు.

● కుప్పం: క్యాన్సర్ వ్యాధిపై గ్రామీణ ప్రాంతాలో ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని పీఈఎస్ మెడికల్ సూపరింటెండెంట్ డా. సుబ్బారావు అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఈఎస్ నర్సింగ్ కళాశాల వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, అందుబాటులో ఉన్న చికిత్సలు, కోలుకునే అవకాశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.అబిరామి, వైస్ ప్రిన్సిపాల్ డా.డానియల్ అరుణ్ కుమార్, అడ్వైజర్ శ్రీదేవి, కోఆర్డినేటర్ డేవిడ్, ఆర్గనైజర్ సుమితా దేవి, నర్సింగ్ కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● గంగవరం: క్యాన్సర్ నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలమనేరు మండలం కొలమాసనపల్లె వైద్యాధికారి డాక్టర్ సుధారాణి పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొలమాసనపల్లెలో వైద్యసిబ్బంది, ప్రజలు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో విజయ హారతి, మధు, ప్రసాద్‌రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: మండలంలోని ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారని ప్రాథమిక వైద్యాధికారులు డాక్టరు దినేష్‌కుమార్‌నాయక్, డాక్టరు వినయ్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకొని రొంపిచెర్ల పట్టణంలోని వీధులలో క్యాన్సర్‌వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ఎక్కువగా నిర్ధారణ అవుతోందని.. సకాలంలో గుర్తించక పోవడంతో చివరిదశలో బయటబడి బాధపడుతున్నారని తెతిపారు. 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. సీహెచ్‌వో కాంతమ్మ, ఎంపీహెచ్ఎస్ పంకజ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను విద్యార్థులు అలవర్చుకోవాలి


విద్యార్థులకు వివరిస్తున్న కేఈసీ వైస్ చైర్మన్ సునీల్‌రాజ్

కుప్పం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): యువత అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డా.సునీల్‌రాజ్ అన్నారు. కేఈసీలో టెక్నికల్ ఫెస్ట్ 2025ను అడ్వాన్స్ మైక్రోవేవ్ అండ్ కాగ్నిటివ్ రేడియో ల్యాబ్‌లో నిర్వహించారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఏఐ ఎంఎల్, డేటాసైన్స్ విభాగాల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొని ప్రాజెక్టు ఎక్స్‌పో ప్రారంభించారు. విద్యార్థుల లక్ష్యసాధనకు ఈ ప్రాజెక్టును ఓ వేదికగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కేఈసీ ప్రిన్సిపాల్ డా.సుధాకర్‌బాబు, ఈసీఈ విభాగాధిపతి డా.రామయ్య, ప్రొఫెసర్లు డా.రసదొరై, డా.వి.శేఖర్, డా.అజయ్‌కుమార్‌రెడ్డి, డా.నవీన్‌కుమార్, డా.సంతోష్, డా. సతీష్, పీఆర్‌వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు


పుంగనూరు: సూర్యప్రభపై కల్యాణ వెంకటరమణస్వామి


కల్లూరు : పుష్పపల్లకీలో ఊరేగుతున్న లక్ష్మీ నరసింహస్వామి


విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి


చౌడేపల్లెలో ఊరేగుతున్న సీతారాములు

పుంగనూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు చేపట్టారు. స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మునీంద్రబాబు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●చౌడేపల్లె: స్థానిక బజారు వీధిలో వెలసిన హరిమందిరంలోని సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వాములను మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

●రామకుప్పం: రామకుప్పంలోని ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. శ్రీవేంకటేశ్వర స్వామి, శనీశ్వరస్వామి, అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లోనూ పూజలు నిర్వహించారు.

● కల్లూరు : పులిచెర్ల మండలం దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆల యంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకృతుడైన పుష్ప పల్లకీలో ఆశీనులై పురవీధుల్లో ఊరేగారు.

బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండల పరిధిలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని జువ్వలదిన్నెతాండా, పత్రపల్లె తాండాల సమీపంలోని వ్యవసాయ పొలాల్లో నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి నిల్వ ఉంచిన బెల్లం ఊటను గుర్తించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, జవహర్‌బాబు, సతీశ్, సుబ్రహ్మణ్యం, సిబ్బంది దేవప్రసాద్, ఢిల్లీబాబు, సుబ్రహ్మణ్యంగౌడు, నాగరాజ, పన్నీర్‌నాయక్, జ్యోతి, వెంకటేష్, వినోద్, శ్వేత, మమత, రాజేశ్వరి పాల్గొన్నారు.

మసీదు ప్రహరీ ధ్వంసం



కల్లూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం రెడ్డివారిపల్లి పంచాయతీ తురకపేట మసీదు ప్రహరీని మంగళవారం వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు మసీదు కమిటీ పెద్దలు నజీర్‌బాషా, కరీంసాహెబ్ తెలిపారు. మసీదు కమిటీ సభ్యులు కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సమన్వయంతో కలిసి మెలిసి అభివృద్ధి చేసుకోండి



ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న వీకేఆర్‌పురం వాసులు

నగరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామీణ స్థాయి నాయకులు కలిసి, మెలిసి సమన్వయంతో అభివృద్ధి పనులను చేపట్టాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో మంగళవారం వీకేఆర్‌పురం, ఓజీకుప్పం నాయకులు, కార్యకర్తలతో ఆయన అభివృద్ధి పనులపై చర్చించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, దేశమ్మగుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, హరిబాబు, నారాయణస్వామి నాయుడు, వరదరాజులు యాదవ్, భూపతిరెడ్డి, సెల్వమణి, కుమార్ నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా లక్ష్యాలను పూర్తిచేయండి



చీఫ్ మేనేజర్ మహేష్‌తో మాట్లాడుతున్న డీసీసీబీ సీఈవో మనోహర్‌గౌడ్

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 2024 - 2025 ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా బ్యాంకులు తమ లక్ష్యాలను పూర్తిచేయాలని డీసీసీబీ సీఈవో మనోహర్‌గౌడ్ ఆదేశించారు. గంగాధరనెల్లూరు డీసీసీబీ బ్రాంచ్‌ను మంగళవారం సీఈవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా బ్యాంక్ పరిధిలో రుణాల గ్రౌండింగ్, రికవరి, డిపాజిట్లపై సీఈవో ఆరా తీశారు. అదేవిధంగా ఆర్థిక సంవత్సరం ముగింపులో బ్యాంక్ అధికారులు పాటించాల్సిన అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాధరనెల్లూరు డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మహేష్, మేనేజర్ విజయ, సింగిల్‌విండో సొసైటీ సీఈవో విజయకుమార్‌రెడ్డి, సుప్రియ, తేజ పాల్గొన్నారు.

నేడు ఐవోసీఎల్‌లో ఎన్డీఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్



అధికారులకు సూచనలిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం యాదమరిలోని ఐవోసీఎల్‌లో మాక్‌డ్రిల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో ఛాంబర్ ప్రక్కన గల సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ విపత్తు పరిస్థితుల్లో ఎన్డీఆర్‌ఎఫ్ వారి పాత్ర కీలకమన్నారు. అప్పటికప్పుడు ఏర్పడే విపత్తుల నుంచి ఎలా బయటపడాలనే విషయాలను మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, ఎన్డీఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ అనితా సదన్, వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ప్రభాకర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై బహిరంగ సభ

● రూ.26,796 రికవరీకి ఆదేశం



ఉపాధిహామి బహిరంగ సభలో రికార్డులు పరిశీలిస్తున్న పీడీ రవికుమార్

తవణంపల్లె, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8,72,42,541 వ్యయంతో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన 1,419 పనులకు సంబంధించి మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. గోవిందరెడ్డిపల్లె, చెర్లోపల్లె గ్రామాల్లో జరిగిన పనుల్లో రూ.26,796 నిధులు దుర్వినియోగమైనట్లు సామాజిక తనిఖీలో గుర్తించారు. దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని సంబంధిత అధికారులను డ్వామా పీడీ రవికుమార్ ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని పీడీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శివయ్య, ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో రెడ్డిబాబు, ఏపీవో లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లు ఓర్పుతో పని చేయాలి

● జిల్లా టీబీ నియంత్రణాధికారి వెంకటప్రసాద్

ఐరాల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు ఓర్పుతో పని చేయాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నియంత్రణాధికారి వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన ఐరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా డే సమావేశానికి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఆశా, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు లెప్రసీ, ఎయిడ్స్, టీబీ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ రికార్డులను తనిఖీచేశారు. వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, పూర్ణలత, డీపీఎంవో మణి, జాన్, జీవకళ, చిన్నమ్మ, ఉమాపతి, జయలక్ష్మీ, అజార్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో ప్రసవ కేసులు పెంచండి

పెనుమూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో వచ్చే గర్భిణులకు ప్రసవాలు సీహెచ్‌సీలో చేయాలని డీసీహెచ్‌ఎస్ ప్రభావతి అన్నారు. మంగళవారం ఆమె పెనుమూరు సీహెచ్‌సీ ఆస్పత్రిని తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రసవ కేసులు ఇక్కడి నుంచి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి అధికంగా వస్తున్నాయని.. ఇక్కడే కాన్పులు చేయాలని డాక్టర్లకు సూచించారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. నూతన సీహెచ్‌సీ భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పెనుమూరు మండలంలో టీబీ కేసులు అధికంగా నమోదవుతున్నాయని, గ్రామస్థాయిలో పరీక్షలు చేయించాలని సూచించారు. డాక్టర్ సంధ్య, హెడ్ నర్సు నిర్మల పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించండి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర ఆరోగ్య శాఖ సభ్యురాలు డాక్టర్ నర్వీన్ సుల్తానా వివిధ ప్రోగ్రామ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీ సర్వేపై ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా క్యాన్సర్ బాధితుల ప్రాణాలను కాపాడే అవకాశం ఉందన్నారు. టీకాల కార్యక్రమాన్ని, టీబీ, హెచ్ఐవీ, మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలను క్వాలిటీగా నిర్వహించాలన్నారు. వివిధ కార్యక్రమాలకు కోసం ఖర్చు చేసిన రికార్డులను ఆమె తనిఖీ చేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం 49. కొత్తపల్లెమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం నాణ్యతను, మెనూను మంగళవారం పంచాయతీరాజ్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. స్టేజీ ముందు, ప్రేయర్ హాల్‌లో ఎండగా ఉండడంతో విద్యార్థులు కళ్లు తిరిగి పడిపోతున్నారని, వారికి కూలింగ్ షీట్ ఏర్పాటు చేయాలని స్కూల్ చైర్మన్, సిబ్బంది, విద్యార్థులు ఈఈకి విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. పంచాయతీరాజ్ శాఖ డీఈఈ ఆనందరెడ్డి, హెచ్‌ఎం శాంతి, స్కూల్ చైర్మన్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఆగి ఉన్న కంటైనర్‌ని ఢీకొట్టిన మరో కంటైనర్

● గోతిలోకి దూసుకెళ్లి నుజ్జునుజ్జయిన వైనం

● డ్రైవర్‌కు గాయాలు



గోతిలో పడి నుజ్జునుజ్జయిన కంటైనర్లు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయరహదారి మొగిలిఘాట్ దొరచెరువు వద్ద మంగళవారం ఉదయం ఆగి ఉన్న కంటైనర్‌ని మరో కంటైనర్ ఢీకొట్టిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుంచి ఉత్తరప్రదేశ్‌కు వెళుతున్న కంటైనర్ మొగిలి ఘాట్‌కు చేరుకోగానే ప్రమాదానికి గురై రోడ్డుపక్కన ఆగి ఉన్న మరో కంటైనర్‌ని అదుపుతప్పి వేగంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో రెండు కంటైనర్‌లు పక్కనే ఉన్న గోతిలోకి దూసుకెళ్లాయి. ఈ ప్రమాదంలో కంటైనర్‌లు నుజ్జునుజ్జు కాగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ సోహెల్ ఖాన్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటికుంటలో పడి వ్యక్తి మృతి



రవికుమార్ మృతదేహం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ నీటికుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని గుర్రంకొండ్లవూరుకు చెందిన సుబ్బరామయ్య కుమారుడు రవికుమార్(53) దుబాయ్‌లో పని చేసేవాడు. నాలుగు రోజుల క్రితం తండ్రి కర్మక్రియల కోసం గ్రామానికి వచ్చాడు. కురప్పల్లి సమీపంలోని వీరప్పనాయిని చెరువు వాగుపక్కనే ఉన్న దారిలో నడిచి వెళుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. మట్టిలోకి కూరుకుపోవడంతో రవికుమార్ బయటకు రాలేకపోయాడు. చెరువుపక్కనే ఉన్న కొందరు గమనించి ఆయన్ని నీటికుంట నుంచి బయటకు తీయగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రవికుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపిన 18 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు. సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 18 మందిపై కేసు నమోదు చేసి వారిని మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టారు. జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున 18 మందికి రూ.1.80లక్షల జరిమానా విధించారు.

రసాయనిక ఎరువుల కొరత రానీయొద్దు

- ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున నగరి నియోకవర్గ పరిధిలో ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులకు ఎమ్మెల్యే భానుప్రకాష్ సూచించారు. నగరి ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజులతో మంగళవారం ఆయన తన నివాసంలో సమావేశమయ్యారు. రైతులు సాగు చేసిన పంటలకు అనుగుణంగా అవసరమైన ఎరువులను తగిన మోతాదులో స్టాక్ ఉండేలా చూసుకోవాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారంలో తక్షణ చర్యలు తీసుకునేలా అప్రమత్తంగా ఉండాలన్నారు.

భక్తుల వద్ద అధిక ధరలు వసూలు చేస్తే కఠిచర్యలు



లగేజీ కౌంటర్ వద్ద భక్తులతో మాట్లాడుతున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల వద్ద నుంచి దుకాణ దారులు అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో పెంచలకిషోర్ హెచ్చరించారు. మంగళవారం ఆయన అకస్మాత్తుగా ఆలయ దుకాణాల సముదాయాన్ని, పాలాభిషేకానికి పాలు విక్రయించే స్థలాన్ని, లగేజీ, పాదరక్షలు, సెల్‌ఫోన్ భద్రపరిచే కౌంటర్లను, కొబ్బరి కాయలు కొట్టే స్థలాన్ని సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం డ్యాష్ బోర్డు, క్యూఆర్ కోడ్ స్కానింగ్ గురించి భక్తులకు వివరించారు. ఏఈవోలు రవీంద్రబాబు, ప్రసాద్, సూపరింటెండెంట్ రంగస్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నగరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు జీతాలు పెంచి ఉద్యోగభద్రత కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాల సర్వసభ్య సమావేశం యూనియన్ నాయకులు శాంతి, మెనుమ్మల అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నగరి అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ప్రాజెక్టు అధ్యక్షురాలిగా బుజ్జి, కార్యదర్శిగా మునెమ్మ, కోశాధికారిగా శాంతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కస్తూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ, ఉపాధ్యక్షురాలుగా రమణమ్మ, సహాయ కార్యదర్శిగా నీరజలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ వెనుకబడిన కులాలకు చెందిన వారు ఆయా కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. మండలానికి 112 యూనిట్లు మంజూరయ్యాయని, అర్హత కలిగిన వారు గ్రామ సచివాలయాల్లో కానీ ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు 21-60 సంవత్సరాల మధ్య వయస్కులు అర్హులని, కాపు, బలిజ కులాలకు చెందిన అభ్యర్థులు 21-50 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.



చిత్తూరు మహాలక్ష్మి గోదాదేవి ఆంజనేయ సమేత వెంకటేశ్వర ఆలయంలో, కట్టమంచి వరదరాజ స్వామి ఆలయంలో సూర్యప్రభ వాహన సేవ - వేపంజేరిలో సూర్యప్రభ, గరుడ వాహనాలపై లక్ష్మీనారాయణస్వామి

సప్త వాహనాలపై నారాయణుడి దివ్యదర్శనం

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం ఉత్సవమూర్తి నారాయణుడు ఏడు వాహనాలపై అధిష్ఠించి భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు. ఆలయంలో మొదటగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సూర్యప్రభ వాహనం, శేష, హంస, హనుమంత, అశ్వ, గరుడ, చంద్రప్రభ వాహనాలపై ఉత్సవమూర్తి నారాయణుడి విగ్రహాన్ని అధిష్ఠింపజేసి పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులకు వేపంజేరి హైస్కూల్ హెచ్.ఎం. మురళీకృష్ణతో పాటు టీచర్ల బృందం సహకారంతో అన్నదానం చేశారు. ఎస్పీ మణికంఠ చందోలు తల్లిదండ్రులు శారదాదేవి, మంగాచారిలు విచ్చేయగా, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్ గర్గ్ పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

చిత్తూరు కల్చరల్: నగరంలోని వైష్ణవ ఆలయాల్లో మంగళవారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. కట్టమంచి వరద రాజస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి సూర్యప్రభ, గరుడ, హనుమంత, శేష, తీర్థవారి, అశ్వ, పుణ్యకోటి, చంద్రప్రభ వాహన సేవలతో కట్టమంచి పురవీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. స్థానిక మహాలక్ష్మి గోదాదేవి ఆంజనేయ సమేత వెంకటేశ్వర ఆలయంలో స్వామివారికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహిచారు. ఈ కార్యక్రమాల్లో ఈవోలు సుబ్రమణ్యం నాయుడు, టి.వెంకటేషన్, భక్తులు పాల్గొన్నారు.

యాదమరి: మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుడికి సూర్యప్రభ వాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకి శ్రీదేవి పెరిందేవి సమేత ఇంద్ర వరదరాజులు సూర్యప్రభ వాహనంపై సాక్షాత్తు విష్ణుమూర్తి రూపంలో మాడవీధుల్లో విహరించారు. గ్రామస్థులు మంగళకర్పూర హారతులు సమర్పించి స్వామివారిసేవలో తరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



యాదమరిలో సూర్యప్రభ వాహనంపై ఇంద్రవరదుడు - కార్వేటినగరంలో తిరుచ్చి వాహనంపై వేణుగోపాలుడి చిద్విలాసం

వెదురుకుప్పం: కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని పట్టు వస్త్రాలు, సుగంధ భరిత పరిమళ పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చారు. చెక్కల భజనలు, మంగళవాయిద్యాలతో పుర వీధుల్లో స్వామి వారిని ఊరేగించగా ఇంటింటా కర్పూర హారతులను ఇచ్చారు. ఆలయ అధికారి గోపాలం సురేష్‌కుమార్, షరాబు సురేష్‌కుమార్, శివరామశర్మ, గోపాలాచారి, రమేష్, శబరీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఎస్‌ఆర్‌పురం మండలం పిల్లిగుండ్లపల్లికి చెందిన వాటర్‌షెడ్ మాజీ చైర్మన్ గుణశేఖర్ నాయుడు కుటుంబీకుల వితరణతో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

వైభవంగా కల్యాణోత్సవం



ప్రత్యేకాలంకారంలో కరియమాణిక్యస్వామి అమ్మవార్లు

నగరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలో టీటీడీ ఆధీనంలో ఉన్న కరియమాణిక్యస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం 6గంటలకు అమ్మవారి అక్షింతలు, మంగళసూత్రాలను భక్తులు ఆశీర్వదించగా, అర్చకుల వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. టీటీడీ అధికారులు స్వామివార్లకు పట్టుపీతాంబరాలు అందజేశారు. స్థానిక భక్తులు సతీసమేతంగా పాల్గొన్నారు. వేదపండితులు భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

డిగ్రీ విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు



విద్యార్థులకు పతకాలు, ధృవీకరణ పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

నగరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తమిళంలో మెరిట్ సాధించిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను, ధృవీకరణ పత్రాలను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అందించారు. తమిళ భాషాభివృద్ధిలో భాగంగా నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తమిళశాఖ సూచనలతో చెన్నైకి చెందిన సుబ్బురెడ్డియార్ ట్రస్ట్ నిర్వాహకులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన కే.ఏ.ప్రియ, లోకనాధమ్, భువనేశ్వరిలకు బంగారు, వెండి, రజత పతకాలను, ధృవీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాల పట్ల అవగాహన కల్పించండి

● జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

యాదమరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సీజనల్ జ్వరాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన శిబిరాలు నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆదేశించారు. మంగళవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తల నెలవారీ సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించి మాతా, శిశు మరణాల నివారణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్‌కుమార్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మలేరియా అధికారి రామకృష్ణారెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ శివసుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్లు సెల్వరాణి, లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పీలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

దాతల వితరణలను సద్వినియోగం చేసుకుంటాం



కార్వేటినగరంలో ఆలయ అధికారి సురేష్‌కుమార్‌కి పాత్రల వితరణ చేస్తున్న దాతలు - నాదస్వరం అందిస్తున్న దాత

వెదురుకుప్పం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దాతలు ఇచ్చిన వితరణలను సద్వినియోగం చేసుకుంటామని కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ అధికారి గోపాలం సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ ఆలయంలో అటెండరుగా విధులు నిర్వహిస్తున్న బి.మురళిగోపాల్ తన కుమార్తె డాక్టర్ బి. ఝాన్సీ వివాహం జరగడంతో ప్రసాదం తయారీకి ఉపయోగించే 12 ఇత్తడి వంట పాత్రలను వితరణ చేశారు. అదేవిధంగా తిరుపతికి చెందిన చెంచుగార్ల కృష్ణమూర్తి ఆలయానికి నాదస్వరాన్ని వితరణ చేశారు. కార్వేటినగరంకు చెందిన కె.దేవేంద్రన్ డోలును వితరణ చేశారు.

యూరియా కొనుగోలు కోసం విచ్చేసిన రైతులు



దుకాణానికి విచ్చేసిన రైతులు

ఐరాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): యూరియా కొనుగోలు కోసం రైతులు మంగళవారం ఏకంగా దుకాణం వద్దకు విచ్చేశారు. ఐరాల మండలం వైఎస్‌గేటులో యూరియాను విక్రయిస్తుంటే రైతులు విచ్చేశారు. సాధారణంగా సింగిల్‌విండోలో యూరియా అమ్మకాలు నిర్వహించే వారు. ఈసారి ఈ దుకాణానికి 30 మెట్రిక్ టన్నులు ఇవ్వడంతో ఎక్కవ మంది రైతులు యూరియా కొనుగోలు కోసం విచ్చేశారు.

చేపలకోసం చెరువు నీళ్లు ఖాళీ చేసేశారు



మొరవ కొట్టేసిన పాదిరి చెరువు

విజయపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమాంబాపురానికి సాగునీరందించే నింద్ర మండలం పాదిరి చెరువులోని నీటిని చేపల కోసం ఖాళీ చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాదిరి చెరువులో 70 శాతం సాగునీరు గంగమాంబాపురానికి, 30శాతం సాగునీరు పాదిరికి పారుతోంది. భూగర్భ జలాలు పెరగాలని, చిన్నకారు, సన్నకారు రైతులకు సాగునీరు అందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చెరువులను నిర్మించి, సాగునీటిని నిలువజేస్తే చేపల కోసం వారం రోజుల క్రితం మొరవను కొట్టి సాగునీటిని వృధాగా వదిలేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న ఐఫైవ్ నిర్వాహకులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బాస్కెట్ బాల్ క్రీడాకారులకు ముంబాయికి చెందిన ఐ ఫైవ్ యూత్ ఫౌండేషన్ సౌజన్యంతో మంగళవారం దుస్తులను అందజేశారు. ఐ ఫైవ్ బాస్కెట్ బాల్ కోచ్‌లు సలీం, ఝాన్సీ, మేనేజర్ జయసూర్య మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తమ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తూ క్రీడాదుస్తులు, షూస్ పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 120 మంది క్రీడాకారులకు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు తమ వద్ద శిక్షణ తీసుకున్న విద్యార్థులు యూత్ నేషనల్స్, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటారని చెప్పారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జనార్ధన్ రెడ్డి, పీడీ గిరిజ పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న ఐఫైవ్ నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి4: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని సంతపేట దేవిబాల, గిరింపేట దుర్గా పబ్లిక్, దేవి, లిటిల్ ఏంజిల్స్, సరస్వతి, ఆర్‌కె విద్యాలయ పాఠశాలలో విద్యార్థులచే సరస్వతి పూజలు, సామూహిక సూర్య నమస్కారాలు, గాయత్రి మంత్ర పఠనం నిర్వహించారు. విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు, పెన్సిళ్లను ఉచితంగా అందజేశారు. సత్యసాయి సేవాసమితి, బాలవికాస్, మహిళా మండలి, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండలమీట్ మళ్లీ వాయిదా

గుడిపాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో మంగళవారం జరగాల్సిన మండలమీట్‌ను వాయిదా వేసినట్లు ఎంపీడీవో శివరాజన్ తెలిపారు. తదుపరి సమావేశం జరిగే తేదీని తెలియజేస్తామని ఆయన పేర్కొన్నారు.

గ్రీన్ స్కూల్ అవార్డుకు ఎంపిక

వెదురుకుప్పం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం ఆర్కేఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంతో 2024-25 విద్యాసంవత్సరానికి నేషనల్ గ్రీన్ కోర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ ఆధ్వర్యంలో గ్రీన్ స్కూల్ అవార్డుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేశమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాలుర హాస్టల్ తనిఖీ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూగుండ్రం బాలుర హాస్టల్‌ను సోమవారం రాత్రి బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి తనిఖీచేశారు. హాస్టల్లో మొత్తం ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, 10వతరగతి పబ్లిక్ పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారు, వారి విద్యాభ్యాసం పరిస్థితి ఎలా ఉందనే విషయాలపై వార్డెన్ వెంకటేష్ నుంచి వివరాలు తెలుసుకున్నారు.